# ప్రతిభ

ద్వైమాసిక పత్రిక (జులై, ఆగస్టు)
తెలుగు శాఖ



## వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యానగర్

దేశభాషలందు తెలుగు లెస్స







*నా తెలంగాణ కోటి రతనాల వీణ*
*- దాశరథి కృష్ణమాచార్య*

# ప్రతిభ

## ద్వైమాసిక పత్రిక (జులై, ఆగస్టు)

**గౌరవ సంపాదకులు:**
డా. జి సుకన్య గారు,
ప్రధానాచార్యులు
**ప్రధాన సంపాదకులు:**
డా.జె. భారతి,
తెలుగు శాఖ అధ్యక్షులు
**సంపాదక సహకారం:**
తెలుగు శాఖ అధ్యాపకులు
మరియు
కళాశాల తెలుగు సంఘం విద్యార్థులు



కళాశాల వ్యవస్థాపకులు
ఖండవల్లి లక్ష్మీరంజనం గారు

**లోపలి పుటల్లో...**

ఆలోచన...2
ముఖచిత్ర పరిచయం...3
పోటీ పరీక్షలకు తెలుగు...4
పదకేళి...8
విద్యార్థుల రచనలు...9
సాహిత్య రత్నాలు...15
మీకు తెలుసా!...21
ఓ మంచి పద్యం...23
పదవినోదం...24
కళాశాల వార్తా కదంబం...25

నూరు పువ్వులు వికసించనీ వెయ్యి ఆలోచనలు సంఘర్షించనీ

# ఆలోచన

ఆనో భద్రా: క్రతవోయంతు విశ్వతః

-- ఋగ్వేదం

అన్ని వైపుల నుండి వచ్చే ఆలోచనలని స్వీకరించాలి అంటుంది వేదం. అదే జ్ఞానానికి పునాది. అదే ఆలోచనా వికాసానికి దోహదకారి.

వివేకానంద కళాశాల తెలుగు శాఖ వివిధ కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల ఆలోచనా వికాసానికి బాటలు పరుస్తోంది. 2019 నుండీ తెలుగు శాఖ నిర్వహిస్తున్న 'గోడ పత్రిక' అనేకమంది విద్యార్థుల ఊహాలకు అక్షర అభివ్యక్తి.

విద్యార్థులు తాము చదివిన పుస్తకాల గురించి రాసిన సమీక్షా వ్యాసాలను గత సంవత్సరం లో e బుక్ రూపంలో సంకలించడం తెలుగు శాఖ యొక్క ఆధునిక అభివ్యక్తి.

ఈ సంవత్సరం తెలంగాణ భాషా దినోత్సవం రోజున 'ప్రతిభ' పేరుతో ద్వైమాస పత్రికను e మ్యాగజైన్ గా తెలుగు శాఖ ఆరంభించి ఆవిష్కరిస్తోంది. రెండు నెలలకు ఒకసారి విడుదలయ్యే ఈ పత్రికలో పోటీ పరీక్షలకు ఉపయోగించే తెలుగు బిట్స్, భాషా జ్ఞానాన్ని పెంచే పదవినోదాలు, ఆయా నెలలలో జన్మించిన ప్రముఖ రచయితల గురించిన ప్రధాన సమాచారం, కళాశాలలో జరిగే కార్యక్రమాల సమాచారం, చిత్రాలతో పాటు విద్యార్థుల రచనలు (వ్యాసాలు, కథలు, కవితలు) ప్రచురించబడతాయి.

ఈ పత్రికా నిర్వహణకై తెలుగు శాఖను ఎంతగానో ప్రోత్సహించిన ప్రధానాచార్యులు డా. జి. సుకన్య గారికి, తెలుగు శాఖ మరియు విద్యార్థుల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను. విద్యార్థులందరికీ ఉపయోగించే పత్రికగా దీనిని తీర్చిదిద్దటంలో ఎంతగానో సహకరిస్తున్న చి. అభిలాష్ ని తెలుగు శాఖ పక్షాన మనస్పూర్తిగా అభినందిస్తున్నాను.

తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలతో..

-- ప్రధాన సంపాదకులు

# ముఖచిత్ర పరిచయం



నా తెలంగాణ కోటి రతనాల వీణ అని ఎలుగెత్తి చాటిన **దాశరథి 1925 జూలై** 22 న జన్మించారు. ఈయన గురించిన మరిన్ని ఆసక్తికరమైన వివరాలు లోపలి పేజీల్లో తెలుసుకోండి



1931 జూలై 29 న జన్మించి, జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి తెలంగాణ కవిగా ప్రసిద్ధి చెందిన **సి.నా.రె** గారి జీవిత విశేషాలను లోపలి పుటల్లో తెలుసుకోండి.



వ్యవహారిక భాషోద్యమానికి పట్టంకట్టిన **గిడుగు రామ్మూర్తి పంతులు 1863 ఆగస్టు 29న** జన్మించారు. ఈయన గురించిన మరిన్ని జీవిత విశేషాలను లోపలి పేజీల్లో తెలుసుకోండి.

# పోటీ పరీక్షలకు తెలుగు ప్రశ్నావళి

పోటీ పరీక్షలను ఉద్దేశించి తయారుచేసిన తెలుగు సాహిత్య క్విజ్ లో పొల్గొని కొత్త విషయాలను తెలుసుకోండి..!

1. **నన్నయ బిరుదు ఏది?**

అ) ఆదికవి

ఆ) ఆంధ్ర కవి

ఇ) ఆశుకవి

ఈ) అక్షర కవి

2. **తిక్కన ఎవరి ఆస్థానంలో ఉండేవారు?**

అ) రాజరాజ నరేంద్రుడు

ఆ) ప్రోలయ వేమారెడ్డి

ఇ) మనుమసిద్ధి

ఈ) రఘునాథ నాయకుడు

3. **కింది వాటిలో శ్రీనాధుని రచన ఏది?**

అ) శృంగార శాకుంతలం

ఆ) శృంగార నైషధం

ఇ) మనుచరిత్ర

ఈ) వసుచరిత్ర

4. **అష్టదిగ్గజ కవులు ఎవరి ఆస్థానంలో ఉండేవారు?**

- అ) రామరాయలు
- ఆ) శ్రీకృష్ణదేవరాయలు
- ఇ) విజయ రాఘవ నాయకుడు
- ఈ) రఘు నాధ నాయకుడు

**5. శ్రీకృష్ణ దేవరాయలు రచించిన ప్రసిద్ధ గ్రంధం ఏది?**

అ) మను చరిత్ర

ఆ) ఆముక్త మాల్యద

ఇ) ఆంధ్ర మహాభారతం

ఈ) పాండురంగ మాహాత్మ్యం

**6. క్రిందివానిలో అల్లసాని పెద్దన రచించిన గ్రంధం ఏది?**

అ) స్వారోచిషమనుసంభవం

ఆ) పాండురంగ మాహాత్మ్యం

ఇ) కుమార సంభవం

ఈ) కిరాతార్జునీయం

**7. ఆంధ్ర కవితా పితామహునిగా ప్రసిద్ధుడైన కవి ఎవరు?**

అ) తెనాలి రామకృష్ణుడు

ఆ) అల్లసాని పెద్దన

ఇ) నంది తిమ్మన

ఈ) ధూర్జటి

**8. పింగళి సూరన రచించిన ద్వ్యర్థి కావ్యం?**

అ) గరుడ పురాణం

ఆ) కళాపూర్ణోదయం

ఇ) ప్రభావతీ ప్రద్యుమ్నం

ఈ) రాఘవ పాండవీయం

**9. నారదుడి శిష్యుడు?**

అ) తుంబురుడు

ఆ) మణికంధరుడు

ఇ) పింగళి సూరన

ఈ) శ్రీ కృష్ణుడు

**10. కాళోజీ జన్మదినం?**

అ) సెప్టెంబర్ 9, 1914

ఆ) సెప్టెంబర్ 19, 1914

ఇ) అక్టోబర్ 2, 1914

ఈ) నవంబర్ 14, 1914

**11. పల్లెటూరి పిల్లగాడా పసులగాసే మొనగాడా అనే పాటను రచించింది ఎవరు?**

అ) సి.నా.రె

ఆ) దాశరథి

ఇ) సుద్దాల హనుమంతు

ఈ) సుద్దాల అశోక్ తేజ

**12. విభుదజనుల వలన విన్నంత కన్నంత తెలియ వచ్చినంత తేటపరతు అని చెప్పింది ఎవరు?**

అ) నన్నయ

ఆ) తిక్కన

ఇ) నంది తిమ్మన

ఈ) పోతన

**13. గజేంద్ర మోక్షము భాగవతంలో ఎన్నవ స్కంధంలో ఉంది?**

అ) ఒకటవ స్కంధం

ఆ) నాల్గవ స్కంధం

ఇ) ఆరవ స్కంధం

ఈ) ఎనిమిదవ స్కంధం

**14. కుర్క్యాల శాసనంలో గల పద్యాలు?**

అ) కంద పద్యాలు

ఆ) ఉపజాతి పద్యాలు

ఇ) ఆటవెలది పద్యాలు

ఈ) తేటగీతి పద్యాలు

**15. భర్తృహరి రాసిన గ్రంథం?**

అ) మనుచరిత్ర

ఆ) పంచతంత్రం

ఇ) సుభాషిత త్రిశతి

ఈ) ఆముక్తమాల్యద

**16. పాంచాల దేశాధీశుడు ఎవరు?**

అ) తెనాలి రామకృష్ణుడు

ఆ)దృతరాష్ట్రుడు

ఇ) నంది తిమ్మన

ఈ) దృపదుడు

**17. తొలి తెలుగు రామాయణం రచించింది ఎవరు?**

అ) సి.నా.రె

ఆ) దాశరథి

ఇ) గోన బుద్ధారెడ్డి

ఈ) సుద్దాల అశోక్ తేజ

**18. తాలాంకుడు అనగా ఎవరు?**

అ) శ్రీ కృష్ణుడు

ఆ) తిక్కన

ఇ) బలరాముడు

ఈ) పోతన

**19. 'రాజు చేతి కత్తి రక్తంబు వర్షించు – సుకవి చేతి కత్తి సుధలు గురియ' అన్న కవితా పాదం ఎవరిది?**

అ) జాషువా

ఆ) దాశరథి

ఇ) గురజాడ అప్పారావు

ఈ) శ్రీశ్రీ

**20. మహాప్రస్థానం అంటే అర్థం?**

అ) గొప్ప ప్రయాణం

ఆ) ప్రగతి

ఇ) ముందడుగు

ఈ) సామ్యవాదం

## సమాధానాలు

| | | | |
|---|---|---|---|
| 1-అ | 6-అ | 11-ఇ | 16-ఈ |
| 2-ఇ | 7-ఆ | 12-ఈ | 17-ఇ |
| 3-ఆ | 8-ఆ | 13-ఈ | 18-ఇ |
| 4-ఆ | 9-ఆ | 14-అ | 19-అ |
| 5-ఆ | 10-అ | 15-ఇ | 20-అ |

# పదకేళి

## తప్పొప్పులు

కింది పదాలలో ఏవి సరైనవో గుర్తించండి

1. సామాగ్రి( ) సామగ్రి( )
2. ప్రశ్నాపత్రం ( ) ప్రశ్నపత్రం( )
3. మల్లిఖార్జున ( ) మల్లికార్జున ( )
4. ఆనందబాష్పాలు( ) ఆనందభాష్పాలు ( )
5. బాధ( ) భాధ ( )
6. కథ( ) కద( )
7. ఆశీస్సు( ) ఆసీస్సు( )
8. జండా( ) జెండా ( )
9. ఉదహరించు( ) ఉదాహరించు( )
10. చామంతి( ) చేమంతి( )

సమాధానాలు: తదుపరి పత్రికలో

# కవితలు

## ఆదర్శం

విడిపోయిన రెండింటిని కలపడానికి తాపత్రయ పడే సూది
ఆదర్శం...

తన మూలంగా లోకం ఆగిపోకూడదని రోజంతా వెలుగునిచ్చే
సూర్యుడు ఆదర్శం...

తను కరిగిపోయినా పక్కవాళ్లకు వెలుగునివ్వాలనుకునే
కొవ్వొత్తి ఆదర్శం...

తీరాన్ని సంద్రంగా మార్చాలని అనుక్షణం ప్రయత్నించే అలలు
ఆదర్శం..

పడకొట్టినవాడిపైన పగపట్టకుండా,
దారం దారం పోగేసుకుని మరో గూడు కట్టుకునే సాలేపురుగు
ఆదర్శం..

ప్రకృతి ఆదర్శం ప్రతి మనిషి ఆదర్శం
మన లక్ష్యం ఛేదించుటకై ఆదర్శమే ఆయుధం

-పి.సాయి కుమార్
బీఎస్సీ తృతీయ సంవత్సరం

## <u>నన్ను నేను తెలుసుకున్న!</u>

నన్ను నేను వెతుకుతున్న
        అయిష్టంగా బతుకుతున్న
నన్ను నేను తెలుసుకున్న
        అని నేను అనుకున్న
అర్ధరాత్రి కలగన్నా
        మెళుకువతో తేరుకున్న
నాలోనే నవ్వుకున్నా
        తిరిగి నిద్రలోకి జారుకున్న
తర్వాత తెలుసుకున్న
        నేను నేను కాదు అని

పి. రంజిత్ రెడ్డి
బీఎస్సీ(ఎంపీసీ) మూడవ సంవత్సరం

# వ్యాసాలు

# తెలుగు భాషా విశిష్టత

తెలుగు భాష చాలా గొప్పది. మనం మన భాషతో పాటు పరభాషను కూడా గౌరవిస్తాం. ఎందుకంటే మనం ఒకరి భాషను గౌరవిస్తే వాళ్ళకు మన భాష పట్ల గౌరవం పెరుగుతుంది. తెలుగు భాషా దినోత్సవాన్ని మనం ఆగస్టు 29న జరుపుతుంటాం. తెలుగు పట్ల మనకున్న గౌరవాన్ని ఇతరులకి ఎప్పుడూ తెలియజేస్తూ ఉండాలి, అప్పుడే మనభాష పట్ల ఇతరులకు అవగాహన పెరుగుతుంది. తెలుగు భాషలో ఎన్నో కవితలు, పద్యాలను రచించి మన భాష ఔన్నత్యాన్ని చాటిన తెలుగు కవులు ఎందరో ఉన్నారు. తెలుగు భాషలో ఒక్క పదానికి ఎన్నో అర్థాలు ఉంటాయి. తెలుగు భాష మన మాతృభాష మనం మన కన్నతల్లిని ఎలా గౌరవిస్తామో అలాగే మన మాతృభాషను కూడా అలాగే గౌరవించాలి. ముందు తరాలకు కూడా తెలుగు భాష గురించి, ప్రాముఖ్యతను గురించి గొప్పగా తెలియజేయాలి.

సిహెచ్. నందిని

బీకాం మూడవ సంవత్సరం

# తెలుగు భాష

మానవుడు తను నిత్య జీవితంలో ఎన్నో మార్పులకు గురయ్యాడు భూమి మీద మానవుడికి ప్రత్యేక స్థానం చేకూరడానికి గల కారణం భాష. అదే విధంగా మానవుని నిజ జీవితంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మానవుడు ఎదుటి మానవుని అర్థం చేసుకోవడానికి భాష ఎంతో దోహదపడుతుంది. అదేవిధంగా మన భాష అనేది క్లుప్తంగా అర్థవంతంగా ఉండాలి తెలుగు భాష అనేది ద్రావిడ భాష నుండి పుట్టింది. ఎందరో ఇతర భాషల కవులు నేర్చుకున్న భాష తెలుగు భాష. తెలుగు భాష ప్రాముఖ్యత రోజు రోజుకు అంతరించిపోతుంది మనం దీనిని గుర్తించుకుని మన వంతుగా భాషను కాపాడుకునే ప్రయత్నం చేయాలి. చిన్నపిల్లవాడు పుట్టినప్పుడు ఎదగడానికి కావాల్సిన పాలు లేక ఇతర జంతువుల పాలను త్రాగిస్తాము. కానీ కుమారుడికి రోగనిరోధక శక్తిని అందించేది మాత్రం తల్లిపాలు అదేవిధంగా మనం మన అవసరాలకు అనుగుణంగా ఇతర భాషలను నేర్చుకోవడం తప్పు కాదు కానీ మన భాషను తక్కువ చేసుకోవడం తప్పు. మన మాతృభాష కమ్మనైన భాష తెలుగు భాష తీయనైన భాష కాబట్టి శ్రీకృష్ణదేవరాయలు ఇలా అన్నారు 'దేశభాషలందు తెలుగు లెస్స'. అదేవిధంగా మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవటం, మన తల్లి వంటి మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ. తెలుగు భాషలో ఎన్నో విషయాలను వివరంగా క్లుప్తంగా ఎంతమంది కవులు వివరించారు కవుల యొక్క జీవనశైలిలో వారు ఎదుర్కొన్న వారి నిజ జీవితాలను వారి పుస్తకాల రూపంలో రాశారు ఈ విధంగా మనం మన ముందు తరాలకు తెలుగు యొక్క గొప్పతనం తెలియజేస్తూ తెలుగు భాష ప్రాముఖ్యతను పెంచాల్సిన అవసరం ఉంది. తెలుగు భాష అర్థవంతమైన, అద్భుతమైన భాష అదే విధంగా మధురమైనది. మన తెలుగు భాష యొక్క గొప్పతనం ఆవశ్యకతను తరతరాలకు వెలుగెత్తి చాటుతూ వారికి తెలియపరిచి కనుమరుగు అవుతున్న మన భాషను కాపాడుకుందాం.

కె. ఆనంద్ కుమార్
బీఎస్సీ(బి జెడ్ సి) మూడవ సంవత్సరం

# తెలుగు భాషా దినోత్సవం

తెలుగు భాష మన మాతృభాష కాబట్టి తెలుగును మనం మరవరాదు. దేశభాషలందు తెలుగు లెస్స అన్నారు అప్పట్లో శ్రీకృష్ణదేవరాయలు గారు కానీ ప్రస్తుతం భారతదేశంలో చాలామంది ప్రజలు తెలుగును మరిచిపోతున్నారు. చాలామంది మాతృభాష పదాలను ఆదరిస్తున్న సమయంలో చాలామంది మాతృభాషను వీడుతున్నారు. కాబట్టి అందరూ కూడా భాషా ప్రాముఖ్యతను తెలుసుకోవాలి. తెలుగు భాష చాలామందికి వచ్చిన భాష అదే విధంగా తెలుగు భాష ద్రవిడ భాషకు చెందింది. ప్రపంచ భాషలలో తెలుగు లిపి రెండవ స్థానంలో ఉంది. తెలుగు అంటే అమ్మతనం పుట్టిపడుతుంది. ఇతర దేశాల ప్రజలు సైతం వచ్చి మన భాషను ఎంతో ఉత్సాహంగా నేర్చుకుంటున్నారు. కానీ ప్రస్తుతం మన రాష్ట్రాలలో మాత్రం తెలుగును చులకనగా చూస్తున్నారు. తెలుగులోని కమ్మదనం చాలామందికి తెలియదు తెలుగు తేనె పలుకుల వంటిది దాని మధురం దానిని మాట్లాడే ప్రజలకు మాత్రమే తెలుస్తుంది. అటువంటి తెలుగును మనం మరవకుండా ఉండాలి. మన భాష చాలా ఇతర రాష్ట్రాలలో కూడా ఒక బోధనా భాషగా ఉంటుంది. తెలుగు మన ప్రాచీన భాష కాబట్టి మనం మన మాతృభాషను గౌరవిద్దాం. మనం రోజువారి నిత్యజీవనంలో చాలా ఆంగ్ల పదాలు వచ్చి చేరాయి అయినా మనం గుర్తించడం లేదు మనం మన భాషా విధానం ఎప్పుడు ఒకే విధంగా ఉంటుంది కాబట్టి భాషను గౌరవిద్దాం. విదేశీయులు సైతం వచ్చి మన తెలుగు భాషను నేర్చుకుంటున్నారు కానీ మనం మన భాషను మరిచిపోతున్నాము. చాలా మండి కవులు, రచయితలు తెలుగులో అనేక గ్రంథాలను రచించడం జరిగింది. ఆ సాహిత్యాన్ని ఆధారంగా చేసుకొని తెలుగుభాష ఔన్నత్యాన్ని పెంపొందిచాల్సిన బాధ్యత మనపైనా ఉంది.

బాలు ప్రసాద్
బీఎస్సీ మూడవ సంవత్సరం

# చిత్రలేఖనం

ఆజాదీకా అమృతోత్సవ్ లో భాగంగా కళాశాలలో నిర్వహించబడిన చిత్రలేఖనం పోటీలలో విద్యార్థులు గీసిన కొన్ని చిత్రాలు












# సాహిత్య రత్నాలు



## దాశరథి కృష్ణమాచార్య

**ఓ నిజాము పిశాచమా కానరాడు**
**నిన్నుబోలినరాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు**
**నా తెలంగాణ కోటి రత్నాలవీణ** అని ఎలుగెత్తి సభలలో వినిపించిన **దాశరథి కృష్ణమాచార్యులు** ''దాశరథి''గా సుప్రసిద్ధులు.

దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా గూడూరు గ్రామంలో జన్మించారు. ఈయన సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసారు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసారు. కథలు, నాటికలు, సినిమా పాటలు వంటి అనేక రచనలు చేశారు. ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించారు. పళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నారు.

నిజాం నిరంకుశ పరిపాలనలో ప్రజలకు ఎలంటి స్వేచ్ఛఉండేది కాదు. ప్రజలు తమ మనసులోని కోర్కెలను తెలుపుకొనుటకు గాని, సభలు ఏర్పాటుచేసి తమ కష్టాలను, బాధలను చేప్పుకోవడానికి వీలుండెది కాదు. ప్రజలపై అధికపన్నులు విధించడం, వారి భూములను లాక్కోవడం, ఇలా వారిని నానా రకాలుగా బాధించే వారు. రజాకార్లు ప్రజల పాలిట నరభక్షకుల్లా తయారయ్యారు. వీరు ఇండ్లపై పడి ప్రజల్ని ఊచకోతకోసేవారు.

ఈ విధంగా తెలంగాణ ప్రజలు నిజాం నవాబుల పరిపాలనలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేకుండా జీవచ్ఛవాల్లా బ్రతికేవారు. ఇలా వీరి మతోన్మాద, కిరాతక, నియంతృత్వ, నిరంకుశ పాలనను ఎదిరించి నిజాం నవాబుకు సింహస్వప్నమై నిలిచి...

***ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ బడగొట్టి మంచి మా***
***గాణములన్ సృజించి ఎముకల్ నుసిజేసి పొలాలు దున్ని భో***
***షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే, తెలం***
***గాణము రైతుదే; ముసలి నక్కకు రాచరికంబు దక్కునే?*** అని గర్జించారు.

**కవితా సంపుటాలు**

అగ్నిధార, మహాంధ్రోదయం, రుద్రవీణ, మార్పు నా తీర్పు, ఆలోచనాలోచనాలు, ధ్వజమెత్తిన ప్రజ,  కవితా పుష్పకం, తిమిరంతో సమరం మొదలైన కవితా సంపుటాలు దాశరథి గారి కలం నుండి జాలువారాయి.

*ఈయన రాసిన  కవితాపుష్పకానికి  ఆంధ్ర సాహిత్య అవార్డు, తిమిరంతో సమరం కవితా సంపుటికి  కేంద్ర సాహిత్య అవార్డు లభించింది.*

***బిరుదులు***

- అభ్యుదయ కవిసింహంకవిసామ్రాట్
- యువకవిచక్రవర్తి
- ఆంధ్రవిశ్వవిద్యాలయం వారి 'కళాప్రపూర్ణ'
- ఆంధ్ర,ఆగ్రా,శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాల గౌరవడాక్టరేట్లు
- ఆంధ్రకవితాసారథి
- ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి 1977 నుంచి 1983 వరకు..
- ఆంధ్రా కవితా సారథి

తెలంగాణ ప్రజల పక్షాన నిజాం నిరంకుశత్వ పాలనకు వ్యతిరేకంగా గర్జించిన దాశరథి గారి గొంతు 1987 నవంబరు 5 న మూగబోయింది. భౌతికంగా మాత్రమే దూరమైనప్పటికీ తెలంగాణ ప్రజల చైతన్యంలో ఇప్పటికీ ఇంకా సజీవుడుగానే ఉన్నాడని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

తెలంగాణ ప్రభుత్వం  ప్రతీ సంవత్సరం జులై 22వ తేదీన దాశరథి గారి జయంతిని వైభవంగా జరుపుతుంది. ఉత్తమ కవులకు, రచయితలకు ఆయన పేరుతో అవార్డులు కూడా అందిస్తున్నది.

---

- 2020 దాశరథి పురస్కారం - తిరునగరి రామానుజయ్య గారు
- 2021 దాశరథి పురస్కారం – ఎల్లూరి శివారెడ్డి గారు
- 2022 దాశరథి పురస్కారం – ఆచార్య వేణు సంకోజు గారు

# సినారె (డా. సింగిరెడ్డి నారాయణరెడ్డి)

## జననం: 29/07/ 1931



**సి.నా.రె.** గా పేరొందిన **సింగిరెడ్డి నారాయణరెడ్డి** జూలై 29, 1931న జన్మించారు. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన ఎనలేని సేవలకు గాను అతనికి 1988లో విశ్వంభర కావ్యానికి ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారం లభించింది. జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి తెలంగాణ కవిగా ప్రసిద్ధి చెందారు. సినారె రాజ్యసభ సభ్యునిగా కూడా పనిచేశారు. తెలుగు చలన చిత్ర రంగంలో అతను రాసిన పాటలు ఎంతో ప్రసిద్ధి చెందాయి.

సినారె పద్య కావ్యాలు, గేయ కావ్యాలు, వచన కవితలు, గద్య కృతులు, చలనచిత్ర గీతాలు, యాత్రా కథనాలు, సంగీత నృత్య రూపకాలు, ముక్తక కావ్యాలు, బుర్ర కథలు, గజళ్ళు, వ్యాసాలు, విమర్శన గ్రంథాలు, అనువాదాలు మొదలైనవి రాశారు. కళాశాల విద్యార్థిగా ఉన్నపుడు *శోభ* పత్రికకు సంపాదకత్వం వహించారు. రోచిస్, సింహేంద్ర పేరుతో కవితలు రచించేవారు. సినారె కవిత తొలిసారి జనశక్తి పత్రికలో అచ్చయింది. విద్యార్థి దశలోనే *ప్రహ్లాద చరిత్ర*, *సీతాపహరణం* వంటి పద్య నాటికలు, *భలే శిష్యులు* తదితర సాంఘిక నాటకాలు రచించారు. 1953 లో నవ్వని పువ్వు సంగీత నృత్య నాటిక ప్రచురితమైంది. అది సి.నా.రే తొలి ప్రచురణ. ఆ తర్వాత **జ**లపాతం, విశ్వగీతి, అజంతా సుందరి వెలువడ్డాయి

**సినారె - ప్రముఖ రచనలు:**

- విశ్వంభర ( జ్ఞానపీఠ పురస్కారం)
- మనిషి - చిలక
- ముఖాముఖి
- భూగోళమంత మనిషి
- దృక్పథం
- కలం సాక్షిగా
- కలిసి నడిచే కలం
- కర్పూర వసంతరాయలు
- మట్టి మనిషి ఆకాశం
- మంటలూ - మానవుడూ ( కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1973))

**సినారె – ప్రసిద్ధ ఉల్లేఖనలు:**

- అవయవాలు చస్తాయి కాని ఆలోచనలు చావవు. (మట్టి మనిషి ఆకాశం గ్రంథంలో)
- కుత్తుకులను నరికితే కాదు, గుండెలను కలిపితే గొంతు. (మట్టి మనిషి ఆకాశం గ్రంథంలో)
- ఏ భాష చెణుకైనా, ఏ యాస చినుకైనా తనలోన కలుపుకొని తరలింది తెలుగు.
- కప్పి చెప్పేవాడు కవి. విప్పి చెప్పేవాడు విమర్శకుడు.
- అదృష్టమనేది మత్తకోకిలలా ఉంటుంది. అది కాలమనే మావి గుబుళ్ళలో దాగి ఉంటుంది.
- అంత కడుపెడు పాలపై ఒక్కింత మీగడ పేరినట్లు మనకు మిగులును గతంలోపలి మంచి, అదియే సంప్రదాయం.
- అందరిలాగే సామాన్యుణ్ణి. అయినా చిరంజీవుణ్ణి.

తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేసిన సినారె గొంతుక అనారోగ్య కారణంగా జూన్ 12, 2017న మూగబోయింది.

# గిడుగు రామ్మూర్తి పంతులు

## (తెలుగు భాషా దినోత్సవం - ఆగస్టు 29)



వ్యావహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి  జయంతిని తెలుగు భాషాదినోత్సవం గా జరుపుకుంటాం.

**గిడుగు వెంకట రామమూర్తి పంతులు**

గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ప్రతి ఒక్కరికీ దగ్గరైంది.

**సవర భాష పాండిత్యం:**

గిడుగు వారికి సవరల భాష నేర్చుకొని అడవుల్లో ఉండే వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగింది. తెలుగు, సవరభాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నాడు. సవరభాషలో పుస్తకాలు వ్రాసి, సొంతడబ్బుతో పాఠశాలలు పెట్టి, అధ్యాపకుల జీతాలు చెల్లించి, సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశాడు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913 లో "రావు బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నాడు. ముప్పై అయిదేళ్ళ కృషితో 1931 లో ఇంగ్లీషులో సవరభాషా వ్యాకరణాన్ని, 1936 లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించాడు.

మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931 లోను, సవర-ఇంగ్లీషు కోశాన్ని 1938 లోను అచ్చువేశారు. 1934 లో ప్రభుత్వం అతనికి 'కైజర్-ఇ-హింద్ ' అనే స్వర్ణ పతకాన్ని ఇచ్చి గౌరవించింది.

**పురస్కారాలు:**

- 1934 లో ప్రభుత్వం *కైజర్ ఎ హింద్* బిరుదు ఇచ్చి గౌరవించింది.
- 1913 లో ప్రభుత్వం *రావు సాహెబ్* బిరుదు ఇచ్చింది.
- 1938 లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు *కళాప్రపూర్ణ*తో గౌరవించింది.

గిడుగు రామమూర్తి పంతులు, జనవరి 22, 1940 న కన్ను మూశారు.

# మీకు తెలుసా!

తెలుగు భాషా ప్రథమాలను గురించి మీకు తెలుసా? అయితే ఆలస్యం చేయకుండా తెలుసుకోండి మరి!

- శాసనాలలో తొలి తెలుగు పదం - నాగబు
- తొలి పూర్తి తెలుగు శాసనం - రేనాటి చోడులది
- తొలి తెలుగు కవి - నన్నయ
- తొలి తెలుగు కావ్యం - ఆంధ్రమహాభారతం
- తొలి తెలుగు నిర్వచన కావ్యం - నిర్వచనోత్తర రామాయణము
- తొలి తెలుగు ప్రబంధము -మనుచరిత్రము
- తొలి తెలుగు నవల - రాజశేఖర చరిత్రము
- తొలి తెలుగు కవయిత్రి - తాళ్ళపాక తిమ్మక్క
- తొలి తెలుగు వ్యాకరణము - ఆంధ్రభాషాభూషణము
- తొలి తెలుగు గణిత గ్రంథము -గణితసార సంగ్రహము
- తొలి తెలుగు ఛందశ్శాస్త్రము - కవి జనాశ్రయము
- తొలి తెలుగు శతకము - వృషాధిప శతకము
- తొలి తెలుగు నాటకము - మంజరీ మధుకీయము
- తొలి తెలుగు శృంగారకవయిత్రి - ముద్దుపళని
- తొలి తెలుగు కథానిక - దిద్దుబాటు
- తొలి తెలుగు దృష్టాంతశతకము - భాస్కర శతకము
- తొలి తెలుగు రామాయణము - రంగనాథ రామాయణము
- తొలి తెలుగు ద్వ్యర్థికావ్యము - రాఘవ పాండవీయము
- తొలి తెలుగు జంటకవులు - నంది మల్లయ, ఘంట సింగన
- తొలి తెలుగు పురాణానువాదము -మార్కండేయ పురాణము

- తొలి తెలుగు ద్విపదకవి - పాల్కురికి సోమన
- తొలి తెలుగు పద్యం (శాసనాలలో) - తరువోజ
- తొలి తెలుగు పద్యశాసనము - అద్దంకి శాసనము
- తొలి తెలుగు ధర్మశాస్త్రము - విజ్ఞానేశ్వరీయము
- తొలి తెలుగు పరిశోధనా వాఙ్మయ గ్రంథము - సకల నీతి సమ్మతము
- తొలి తెలుగు వ్యావహారిక నాటకము - కన్యాశుల్కం
- తొలి తెలుగు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి - ఆంధ్రుల సాంఘిక చరిత్ర
- తొలి తెలుగు ఖురాన్ చిలుకూరి నారాయణరావు
- తొలి తెలుగు వ్యావహారికభాషా వచన గ్రంథం హితసూచని (1853) - స్వామినేని ముద్దునరసింహంనాయుడు (1792-1856).
- తొలి ఉర్దూ-తెలుగు నిఘంటువు - ఐ.కొండలరావు 1938

# ఓ మంచి పద్యం

ఎదుటివారు ఎంత గ్రహించగలరో అంతే ఇవ్వటం పరిపాటి ఈ విషయాన్ని తెలిపే పద్యం పింగళి సూరన రాసిన కళాపూర్ణోదయంలో కనబడుతుంది. తుంబురునికి వైకుంఠంలో సంగీత ప్రదర్శన అవకాశం కలిగినపుడు తుంబురునికి అంత పరిజ్ఞానం ఉందా అని నారదుడు ఆశ్చర్యపోతాడు ఆ సందర్భంలోని పద్యం ఇది-

**పద్యం:**

**తమ విద్య నెవ్వ రే మా**
**త్రము గనఁజాలుదురు వారి దండను దన్మా**
**త్రమ ప్రకటింతురు బుధు లు**
**త్తముల మహిమ నీరు కొలది తామరసుమ్మీ!**

**భావం:**

విద్యాసాగరులైన పండితోత్తములు ఎదుటివారు ఎంత గ్రహించగలరో, అంత మాత్రమే తమ విద్యను ప్రకటించటం కద్దు. ఆ ఉత్తముల మహిమ నీరు కొలది తామర లాగా ఉంటుంది. చెరువులో నీరు అధికమైనకొలది తామర పెరుగట సహజం. పండితులు ఎదుటివారి లోతు తెలిసి తమ విద్యను ప్రదర్శిస్తారు - అని భావం.



# పదవినోదం

| | | | | |
|---|---|---|---|---|
| 1. | | | 2. | |
| 3. | | | | 4. |
| | 5. | | | |
| | 6. | 7. | 8. | |
| 9. | | | | |

**అడ్డం:**

1. దశరథ పుత్రుడు(3)
2. నయనం(2)
3. ఏడాది(3)
5. ఒక రకమైన ఆత్మహత్య(2)
6. శివుడి ఆభరణం(2)
9. దెబ్బ(2)

**నిలువు:**


1. లంకాధిపతి(4)
2. తెలుగు కాలేజ్(4)
4. గణాలకు అధిపతి(4)
5. ఆలోచన(3)
7. నాసిక(2)
8. అక్షరాల 1,00,000(2)

సమాధానాలు: తదుపరి పత్రికలో

# కళాశాల వార్తా కదంబం

మన కళాశాల 2022 ఆగస్టు 29 వరకు న్యాక్ చే బి గ్రేడ్ గుర్తింపుతో ఉండేది. కానీ ఆగస్టు 22, 23 తేదీల్లో జరిగిన న్యాక్ టీమ్ తనిఖీ ఫలితంగా మన కళాశాలకు ఎ గ్రేడ్ గుర్తింపు లభించింది. ఆ రెండు రోజుల్లో జరిగిన న్యాక్ సంబరాల చిత్రమాలికనే ఈ వార్తా కదంబం.





తెలుగు శాఖను సందర్శిస్తున్న న్యాక్ బృందం






కళాశాల అధ్యాపకలు మరియు విద్యార్థులతో న్యాక్ బృందం







వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు



F.19.26/EC(SC-121)/DO 30th August 2022

**The Principal**
**VIVEKANANDA GOVERNMENT**
**DEGREE COLLEGE**
**HYDERABAD - 500044**
**Telangana**

**Dear Principal,**

**Greetings from NAAC!**

I am glad to inform you that the outcome of the Assessment and Accreditation (A&A) exercise of your institution has been processed and approved by the Standing Committee constituted by the Executive Committee to examine the peer team reports and declare the accreditation results. Your institution has been **Accredited** with a **CGPA** of **3.14** on a seven point scale at **A Grade** valid for a period of **5 years** from **30 - 08 - 2022**. The original certificate of




# వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ-గ్రేడ్

**కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు**

**ముషీరాబాద్:** విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఏ-గ్రేడ్ ప్రకటించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య ఓ ప్రకటనలో తెలిపారు. సీజీపీఏ 3.14 పొందినట్లు న్యాక్ ప్రకటించిందని, గతంలో ఉన్న బీ-గ్రేడ్ నుంచి ఏ-గ్రేడ్ సాధించడం పట్ల గర్వంగా ఉందన్నారు. కళాశాలలో నాణ్యమైన విద్యాబోధనతో పాటు అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, వర్చ్యువల్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, లైబ్రరీ, సాహిత్య, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు, పోటీ పరీక్షలపై శిక్షణ తదితర కార్యక్రమాలతో ఏ-గ్రేడ్ సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనితాఅబ్రహం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సౌజన్యతో పాటు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలకు ఎ గ్రేడ్ ను కేటాయిస్తూ న్యాక్ బృందం పంపిన ఈ మెయిల్ మరియు పత్రికలో వార్త





ఏ భాష చెణుకైనా ఏ యాస చినుకైనా తనలోన కలుపుకొని
తరలింది తెలుగు

- సింగిరెడ్డి నారాయణరెడ్డి